# మా అబ్బాయి హైపర్‌యాక్టివ్...!

డైలీ హెల్త్ డైరీ

హోమియో...



డాక్టర్ రాజశేఖర్,
ప్యూర్‌కేర్ హోమియోపతి

మా అమ్మాయి వయసు 26. గారాబంగా పెంచాం. చిన్నప్పటినుండి సెల్ఫిష్‌నెస్ కొంచెం ఎక్కువ. మా చిన్నమ్మాయి బాగా చదువుతుందని తన మీద ఈర్ష్య పడేది. ఆరే ళ్లక్రితం డిగ్రీ పూర్తయిన ప్పటినుండి అమ్మాయిలో చాలా మార్పు వచ్చింది. ఒక్కతే కూర్చుని ఉంటుంది. రాత్రిళ్లు నిద్రపోదు. నన్ను, వాళ్ళ నాన్నను చెడ్డమాటలతో తిడుతుంది. ఏ విషయంలోనైనా తను చెప్పిందే కరెక్ట్ అంటుంది. ఎక్కడికి వెళ్ళినా చుట్టుపక్కల వాళ్ళు తనపై అసూయపడుతున్నారంటుంది. ఇంటికి వచ్చిన వారితో దూకుడుగా ప్రవర్తిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తను మహారాణి అని తనకు సరిపోయే వాళ్ళు లేరని ఏ సంబంధమూ చూడనివ్వడం లేదు. విషయం ఏమిటని ఆరా తీస్తే డిగ్రీలో ఎవరో ఒక అబ్బాయికి ప్రపోజల్ చేస్తే ఆ అబ్బాయి రిజెక్ట్ చేశాడని తెలిసింది. తనలో మార్పు తీసుకురావడానికి హోమియోలో ఏదైనా మందులు ఉంటే సూచించండి.

– సౌజన్య, విజయవాడ

మీరు తనని చిన్నప్పటినుండి గారాబంగా పెంచడం వలన మీ అమ్మాయిలో అహం (ఇగో) వృద్ధి చెంది ఉంటుంది. తను అడిగితే ఇంట్లో వాళ్ళు కాదననట్లుగా బయటివాళ్ళు కూడా కాదనరని భావించి ఉంటుంది. కాని తన ప్రేమ వ్యవహారంలో అలా జరగక పోయేసరికి అహం దెబ్బతిన్నట్లుంది. ఈ విధంగా ప్రేమలో హర్ట్ అయిన సందర్భాల్లో వివిధ రకాల మానసిక, శారీరక సమస్యలు రావచ్చు. హోమియోలో కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో మందులు వాడితే సమస్యలు పూర్తిగా నయమవుతాయి. ప్రస్తుతం ప్లాటినా 10 ఎం. పొటెన్సీలో నెలకు ఒక డోసు ఇస్తూ రోజూ రెండు పూటలా మెడికేటెడ్ పిల్స్ వాడండి. కుదుటపడ్డ తర్వాత కౌన్సిలింగ్ ఇప్పించండి.

మా బాబుకు ఆరేళ్లు. హైపర్ యాక్టివ్‌గా ఉంటాడు. దేనిపైనా 2 నిమిషాలు కూడా దృష్టి పెట్టలేడు. తన వస్తువులు ఎక్కడ ఉన్నాయనే ధ్యాస ఉండదు. మా ఫ్యామిలీ డాక్టర్ హైపర్ ఆక్టివ్ డిజార్డర్ ఉండే అవకాశం ఉందన్నారు. దీనికి హోమియోలో చికిత్స ఉందా? సలహా ఇవ్వగలరు.

– నర్సయ్య, కరీంనగర్

మీ బాబుకు అటెన్షన్ డిఫెక్ట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్ ఉందా లేదా అని తెలుసుకోవడానికి ముందు చిన్నపిల్లల సైకాలజిస్ట్‌ను కలవండి. అలా రావడానికి జెనిటిక్స్, అనువంశికత, పరిసరాల ప్రభావం, పోషకాహార లోపం, సాంఘిక పరిస్థితులు, మెదడు పెరుగుదలలో లోపాలు వంటి కారణాలేమయినా ఉండవచ్చు. సరి అయిన కారణం తెలుసుకొని హోమియోలో బిహేవియర్ థెరపీ ద్వారా సమస్యను చాలా వరకు తగ్గించవచ్చును.



మా అబ్బాయికి ఆరేళ్లు. వాడికి అమ్మాయిల్లాగా డ్రెస్ వేసుకోవడం పూలు పెట్టుకోవడం, లిప్‌స్టిక్ పూసుకోవడం అంటే ఇష్టం. అమ్మాయిలతోనే ఆడుకోవడానికి ఇష్టపడతాడు. అబ్బాయిలతో కలవడు. హోమియో చికిత్స ద్వారా అబ్బాయిలో మార్పు తీసుకురావచ్చా?

– మోనిక, బాపట్ల

చిన్నపిల్లల్లో చుట్టూ ఉండే వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. ఎక్కువగా ఆడపిల్లల మధ్యలో ఉండటం వలన వారి అలవాట్లనే పిల్లలు ఎక్కువగా నేర్చుకొంటారు. మీరు అబ్బాయిని వీలైనంత వరకు అబ్బాయిలు ఉండే చోట ఉంచండి. దీనికి తోడు మీరు కూడా అబ్బాయి ఎలా ఉండాలో నేర్పించండి. సమస్య మెల్లగా నయమవుతుంది. సందేహం ఉంటే హోమియో వైద్యుని ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండటానికి మందులు వాడండి.